# పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికచట్టాలకు సవరణలు జరిపిన హర్యానా అసెంబ్లీ

**ఒకవైపునేమో** బి.జె.పికి అనుబంధ కార్మిక యూనియన్ అయిన బి.ఎం.ఎస్. నాయకత్వం తాను కార్మికచట్ట సవరణలను వ్యతిరేకిస్తున్నట్లు నటిస్తూ అటువంటి చట్ట సవరణల రద్దుకోసం అంతర్జాతీయ కార్మిక సంస్థ వద్ద వివాదాలను లేవదీసి, అందుకోసం పోరాడుతున్నట్లు ప్రచారం కావించుకొంటోంది.

మరోవైపున అటు కేంద్ర ప్రభుత్వమూ, యిటు వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాలూ వివిధ కార్మికచట్టాలను పెట్టుబడిదారులకు మేలుచేసే విధంగా, కార్మికులకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన, అనేక త్యాగపూరిత పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకొన్న హక్కులను రద్దుచేసే విధంగా సవరించటం అన్న ప్రక్రియ నిరాఘాటంగానే సాగిపోతోంది.

ఇటీవలి కాలంలో హర్యానా అసెంబ్లీ పారిశ్రామిక వివాదాల చట్టాన్ని – 2016 బిల్లు రూపంలో, 1948 ఫ్యాక్టరీ చట్టాన్నీ, 1930 కాంట్రాక్టు లేబరు చట్టాన్నీ సవరించి, ఆ సవరణలను ఆమోదించింది.

బడా పారిశ్రామికవేత్తల డిమాండుకు అనుగుణంగా పారిశ్రామిక వివాదాల చట్టం సవరింప బడింది. ప్రస్తుత చట్టసవరణల వలన 300 మంది శాశ్వత కార్మికులను నియమించుకొని పనిచేయించు కొంటున్న పారిశ్రామిక సంస్థ, యధేచ్ఛగా కంపెనీని లాకౌట్ చేయవచ్చును, కార్మికులను రిట్రెంచి చేయవచ్చును, లేదా కంపెనీని మూసివేయవచ్చును. ఇందుకుగాను గతంలో మాదిరి ప్రభుత్వం నుండి అనుమతి పొందాల్సిన అవసరం లేదు. సవరణకు ముందున్న చట్టప్రకారం 100 మందికిపైగా శాశ్వత (క్రమబద్ధ) కార్మికులతో పనిచేయించుకొన్న సంస్థ లేఆఫ్ చేయటానికి కానీ, కార్మికులను రిట్రెంచ్‌మెంటు చేయటానికి కానీ సంస్థను మూసివేసేయటానికి కానీ ప్రభుత్వం నుండి అనుమతి పొందాలనే చట్ట నిబంధన వుంది.

ఇక కాంట్రాక్టు లేబరుచట్టానికి ప్రస్తుత సవరణ వలన ఒక కాంట్రాక్టరు 50 మంది కార్మికులవరకూ, రిజిస్ట్రేషన్ చేయకుండానే, కాంట్రాక్టు పనిలో నియమించుకోవచ్చును. అంటే అటువంటి కాంట్రాక్టరు చట్టప్రకారం నిర్దేశించబడిన ఏ కనీస నిబంధనను కూడా పాటించనవసరంలేదన్నమాట! అంటే అతడి క్రింద పనిచేసే 50 మంది లోపు కార్మికులకు, కాంట్రాక్టు లేబరు చట్టం కల్పించే పరిమితమయిన రక్షణలుకానీ, హక్కులుకానీ వర్తించ వన్నమాట! గతంలో యీ చట్టం కాంట్రాక్టర్లకు విధించిన గరిష్ఠ కార్మికుల సంఖ్య కేవలం 20 మంది మాత్రమే.

1948 – ఫ్యాక్టరీ చట్టం ప్రకారం విద్యుచ్ఛక్తి వాడుకొంటూ 10 మంది కన్నా ఎక్కువమంది కార్మికులతో నడిపే ఫ్యాక్టరీలన్నింటికీ యీ చట్టం వర్తిస్తుంది. చట్టప్రకారం అమలుజరపాల్సిన సదుపాయాలను, సౌకర్యాలను యాజమాన్యాలు విధిగా కల్పించాల్సి వుంది. అయితే యీ చట్టాన్ని ప్రస్తుతం 20 మందిలోపు కార్మికులను వినియోగించుకొంటూ, విద్యుచ్ఛక్తితో నడిపే ఫ్యాక్టరీలను యీ చట్ట పరిధి నుండి మినహాయిస్తూ చట్ట సవరణ చేయబడింది.

పై చట్ట సవరణల వలన వేలాదిమంది చట్టాల పరిధి నుండి మినహాయింపబడి, వారికి చట్ట ప్రకారం చెందాల్సిన కనీసపాటి హక్కులూ – సదుపాయాలను పొందకుండా తప్పించటం జరిగింది.

'ఫెడరలిజం' పేరిట ఎన్.డి.ఎ. పాలకులు, రాష్ట్ర పాలకులకు యిష్టానుసారం కార్మికచట్టాలను సవరించుకొనే అధికారాన్ని యిచ్చిన దాని ఫలితంగా, కేంద్రాన్ని మించిన జోరుతో రాష్ట్ర పాలకులు కార్మిక చట్టాలను, కార్మికులకు వ్యతిరేకంగా పెట్టుబడిదారీ పరిశ్రమాధిపతులకు అనుకూలంగా సవరించటం అన్నది జరిగిపోతోంది.

ఇప్పటికే రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు యిటువంటి కార్మిక వ్యతిరేక కార్మిక చట్టసవరణలను చేబట్టి వున్నాయి. ఇప్పుడు హర్యానా యీ జాబితాలో చేరింది.

ఈ దుర్మార్గాన్ని పసిగట్టిన హర్యానాలోని వివిధ కార్మికసంఘాల సభ్యులైన పారిశ్రామిక కార్మికులందరూ హర్యానా రాష్ట్రానికి చెందిన గురుగాంవ్‌లో గల మినీ సెక్రెటేరియట్ యొక్క ప్రధాన ద్వారం ముందు గుమిగూడి, యీ కార్మిక – వ్యతిరేకమైన చట్ట సవరణలను నిరసిస్తూ, కార్మిక చట్ట సవరణల బిల్లు యొక్క కాపీలను తగులబెట్టి తమ వ్యతిరేకతను తెలియబర్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో కూడా కార్మికులు నిరసన కార్యక్రమాలను చేబట్టారు.

ఇటీవలి కాలంలో హోండా మోటార్ సైకిల్ కార్మికులపై పోలీసులు అమానుషంగా దమనకాండను ప్రయోగించిన నేపథ్యంలో చూసినపుడు యీ కార్మిక చట్టసవరణల యొక్క కార్మిక వ్యతిరేక, యాజమాన్య అనుకూల, ఫాశిస్టు దోపిడీవర్గ స్వభావం బట్టబయలు అవుతుంది!

భారత కార్మికవర్గం నిరంతరం అప్రమత్తంగా వుంటూ, యిటువంటి కార్మిక వ్యతిరేక విధానాలనూ, చర్యలనూ ప్రతిభావంతంగా ప్రతిఘటించేందుకు సంసిద్ధం కావాలి!

oooo